క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లికి అభినందనలు



జెడ్పీ చైర్‌పర్సన్‌కు బొకే అందజేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా మూడేళ్లు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మూడేళ్లపాలనలో ఎవరినీ నొప్పించకుండా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుపరిపాలన అందించారని కొనియాడారు. దర్శి మాజీ ఎమ్మెల్యే, దివంగత బూచేపల్లి సుబ్బారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిల రాజకీయ అనుభవాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు అండగా ఉండి పాలన అందించారన్నారు.

సెమిస్టర్-2 పుస్తకాలు పంపిణీకి సిద్ధం



పంపిణీకి సిద్ధంగా ఉన్న సెమిస్టర్-2 పుస్తకాలు

పుల్లలచెరువు: విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను మండల విద్యావనరుల కేంద్రాలకు సరఫరా చేశారు. వాటిని తరుగతుల వారీగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నామని ఎంఈవో ఇందిర తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలను కలుపుకుని మొత్తం 13,090 పుస్తకాలు వచ్చాయని, వాటిని గురువారం నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు సహకరించాలని ఆమె కోరారు.

కాలభైరవునికి ప్రత్యేక పూజలు



కాలభైరవునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: శ్రీకాలభైరవుని కొండపై భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద కాలభైరవుని కొండపై వెలిసిన శ్రీకాలభైరవుడు, భైరవి అమ్మవార్లకు అర్చకుడు పవన్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో భక్తజనులు పాల్గొన్నారు.


డిగ్రీ విద్యార్థులకు రక్త వర్గీకరణ పరీక్షలు



రక్త నమూనాలను పరిశీలిస్తున్న ల్యాబ్ సిబ్బంది

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్త వర్గీకరణ పరీక్షల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం సాయి లక్ష్మీ ల్యాబ్స్ ఎంఎల్‌టీ వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ బ్లడ్‌గ్రూపు వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి రక్తదానాన్ని చేసి ఆపదలో ఉన్న వారిని కాపాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి, విజయబాబు, అక్రం, జయసింహా, రమేష్‌తో పాటు, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

పది టిక్కీల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం బస్తాలు

కురిచేడు: మండలంలోని ఆవులమంద వద్ద ఆటోలో పది టిక్కీల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా కల్లూరు గ్రామానికి చెందిన రేగుల ప్రభాకర్, కందిమళ్ల చిన్న అంజనేయులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని పల్నాడు జిల్లా వినుకొండలోని సాంబయ్య మిల్లుకు తరలిస్తున్నట్లు వీఆర్వో కాశీం తెలిపారు. ఆటోను పట్టుకున్న యువకులు దాన్ని నేరుగా పోలీసుస్టేషనుకు తీసుకొచ్చి వీఆర్వోకు సమాచారమిచ్చి కేసు నమోదు చేయించారు. ప్రజలు రేషన్ అక్రమ రవాణాను అడ్డుకుంటున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు ఆటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడంతో వారికి భారీ స్థాయిలో ముడుపులు ముట్టాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి



దొనకొండ: వద్దిపాడు పొలాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ



మానేపల్లిలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పుల్లలచెరువు: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. బుధవారం మండలంలోని మానేపల్లి, తెల్లగట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏవో నిర్మలాదేవి, పశువైద్యాధికారి నాగులమీరాలు మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు గ్రామాల్లో నిర్వహిస్తామని, రైతుల ముంగిటకే సేవలు అందించేందుకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిందన్నారు. గ్రామసభ ఏర్పాటు చేసినప్పుడు రైతుల సమస్యలు తెలుసుకుని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ప్రస్తుతం పంట సాగు చేస్తున్న వాటికి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. దీంతో ఉచిత బీమా కూడా చేయించుకోవాలన్నారు. నాగుల్ మీరా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున జీవాలకు డీవార్మింగ్ చేయించాలన్నారు. జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్ కూడా అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ వేయించాలన్నారు. జొన్న కూడా ఇస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శి లచ్చిరామ్‌నాయక్, వీఏఏలు కొండానాయక్, ఆంజనేయులు నాయక్, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని సంగాపురం, వద్దిపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పత్తి, కంది, మిరప, పొగాకు పంటలను పరిశీలించారు. రైతులకు సూచన, సలహాలందించారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తామని, కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు పంట నమోదు చేస్తారని, ఇంకా ఎవరైనా గ్రామాల్లోని రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి వారు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కురిచేడు: ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి పంటలో కాయ తొలుచు పురుగును గమనించినట్లు వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు. ఈ సమయంలో గులాబీరంగు పురుగు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. దీని సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఈ పురుగులను నివారించవచ్చన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని దేకనకొండ, బయ్యవరం గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మిరప పంటలో ప్రస్తుతం పైముడత, కింది ముడత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ క్రాప్ చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. బిందు సేద్యం, తుంపర సేద్యంపై ప్రభుత్వ రాయితీలను ఏపీఎంఐపీ, ఎంఐఏఓ అధికారి కె.వెంకటేశ్వర్లు వివరించారు. మార్కెటింగ్ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖల ద్వారా అమలువుతున్న పథకాలు, వాటి వివరాలు వ్యవసాయాధికారి వివరించారు. వీఏఏలు షేక్ అమ్మద్దీన్, సౌమ్యలత, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మిరపపంటలో సూక్ష్మధాతు లోపం రాకుండా నివారించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పెద్ద బొమ్మలాపురం, చిన్నగుడిపాడు గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ అధికారి క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, పత్తి పంటలను పరిశీలించారు. మిరప నాటిన 30 రోజుల నుంచి నెలకొకసారి అన్ని పోషకాలు కలిపిన మిశ్రమాన్ని నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఈకేవైసీ, సీసీఆర్‌సీ, ప్రధాన మంత్రి పసల్ బీమాపై రైతులకు అవగాహన కల్పించారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మధుబాబు



పెద్దదోర్నాలలో..



రైతులకు సూచనలిస్తున్న ఏఓ బాలకృష్ణ నాయక్

వరినాట్లలో జాగ్రత్తలు పాటించాలి

త్రిపురాంతకం: రైతులు వరినారుమళ్లు నాట్లలో తగిన జాగ్రత్తలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.నీరజ పేర్కొన్నారు. మండలంలోని ఉమ్మడివరం పంచాయతీ పరిధి గుట్లపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి నీరజ మాట్లాడుతూ ప్రస్తుతం సాగర్ రైతులు అధికంగా వరిపంట సాగు చేస్తున్నందున వరిపంట పండించే రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: తెగుళ్లు, పురుగులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ వి. బాలకృష్ణ నాయక్ తెలిపారు. మండలంలోని దర్శి-2 రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ అధికంగా పురుగు మందులు వాడి డబ్బులు వృథా చేసుకోవద్దని చెప్పారు. అధికారులు నిర్ణయించిన మేరకు తగు మోతాదులో మాత్రమే పురుగు మందులు వాడాలన్నారు. సబ్సిడీలో ఇస్తున్న ఎరువులు, పురుగుమందులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు జి.మనోహర్, మార్తమ్మ, వెంకటేశ్వర్లు, మస్తాన్‌రావు పాల్గొన్నారు.



వరినాట్లు వేస్తున్న రైతులకు సూచనలిస్తున్న ఏఓ

నల్లమలలో కురుస్తున్న వర్షాలు



తీగలేరు వాగు వద్ద వరద నీరు

● గంటవానిపల్లె వద్ద మళ్లీ కోతకు గురైన చప్టా

పెద్దదోర్నాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మండల పరిధిలోని నల్లమల అభయారణ్యంలో కురిసిన వర్షాల తీవ్రతకు తీగలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో మండల పరిధిలో ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన గంటవానిపల్లె రహదారిలోని చప్టా మళ్లీ కోతకు గురైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు మొక్కుబడిగా మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోయిందని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత ప్రాదిపదికన బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌టీఐ డైరెక్టర్ డాక్టర్ సునీల్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005పై ప్రజలకు, రైతులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలన్నారు. దీని ముఖ్య ఉద్దేశం, ఉపయోగాలు, లక్ష్యాలు ప్రతి ఒక్కరూ ఈ చట్టం ద్వారా తమకు కావాల్సిన సమాచారం పొందాలని తెలిపారు. ఈ చట్టం 11-05-2005న పార్లమెంట్‌లో ఆమోదం పొంది 15-06-2005న రాష్ట్రపతి ఆమోదించారన్నారు. 12-10-2005 నుంచి అమలులోకి వచ్చిందని తహసీల్దార్ వివరించారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ చట్టం గురించి పౌర సరఫరాల అధికారుల పేర్లు, హోదాలు, ఇతర వివరాలు నోటీస్ బోర్డు ఏర్పాటు చేయడం, ఏదైనా ప్రకటనలన్నీ ప్రతి ఏడాది తాజా సమాచారంతో మార్పులు, చేర్పులు ఉంటే అప్‌డేట్ చేసుకోవాలని ఏఓ తెలిపారు. దరఖాస్తు రుసుం దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారికి ఉచిత రేషన్ కార్డు ఉన్న వారికి వర్తిస్తుందని, సమాచారం ఎందుకని అడిగే ప్రశ్న ఎవరికీ లేదని, గ్రామాల్లోని ప్రజలు ఎవరైనా సమాచారం అడిగితే అధికారులు తప్పని సరిగా ఇవ్వాలని ఏఓ తెలిపారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఓ టి.దేవయ్య, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీనారాయణ

బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ప్రారంభం

దర్శి: స్థానిక కురిచేడు రోడ్డులోని పల్లెవనం పార్కు ఎదుట ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన బ్రాంచి కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్‌కే కిరణ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద బ్యాంక్‌గా సేవలందిస్తోందని చెప్పారు. దర్శి చుట్టుపక్కల సుమారు 50 గ్రామాల వరకు బ్యాంకింగ్ సేవలు అందించినట్లు పేరొన్నారు. మొట్టమొదటి సారిగా ఈ బ్యాంక్‌ను 1908లో మహారాజా ఛాయాజీ రావు గైక్ వాడ ప్రారంభించారన్నారు. గుంటూరు రీజనల్ పరిధిలో 57వ బ్రాంచిని దర్శిలో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తమ బ్యాంక్ ద్వారా రైతులకు బంగారు రుణాలు ఇస్తామని చెప్పారు. బ్యాంక్ ద్వారా డిపాజిట్‌లు సేకరిస్తామన్నారు. బ్రాంచి మేనేజర్ క్యాబిన్‌ను మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, స్ట్రాంగ్‌రూంను దర్శి డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. బ్రాంచ్ మేనేజర్ బేత సోమిరెడ్డి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, కమిషనర్ వై.మహేశ్వరరావు పాల్గొన్నారు.



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ

నీటితో నిండిన రైల్వే అండర్ పాస్



అండర్ పాస్‌లో నిలిచిన నీరు

దొనకొండ: రైల్వే అధికారుల వాహనాలు, ప్రజలు వెళ్లేందుకు అండర్ పాస్ రహదారి నిర్మించారు. అండర్‌పాస్ రహదారిలో నీరు నిల్వ ఉండి వాహనాలకు, పాదాచారులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. అండర్‌పాస్‌లో నిలిచిన నీరు బయటకు వెళ్లేందుకు స్వరంగం నాసిరకంగా ఏర్పాటు చేశారు. వర్షం పడిన సమయంలో నిలిచిన నీరు వెళ్లేందుకు రైల్వే అధికారులు చొరవ తీసుకోలేదు. వర్షం పడితే అండర్‌పాస్‌లో 20 రోజులు నీరు నిలిచి ఉంటాయి. రైల్వే ట్రాక్‌కు రెండు పక్కలా నివాసాలు ఉన్నాయి. బ్యాంక్, పోస్టాఫీస్, పోలీస్‌స్టేషన్, విద్యుత్ సబ్ స్టేషన్, మరి ముఖ్యంగా వైద్యశాల నిత్యం అండర్ పాస్ నుంచి రైల్వే స్టేషన్‌కు, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాలకు నిత్యం రావాల్సి వస్తుంది. అదే కాకుండా విద్యార్థులు పాఠశాలలకు వస్తుంటారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛతా హీ సేవాపై అవగాహన ఉండాలి

తాళ్లూరు (దర్శి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఊటుకూరి కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన కలిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డీబీఆర్సీ రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బి.రమణమూర్తి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి. ముఖ్య అతిథిగా హాజరైన సంఘ సేవకుడు జీవీ రత్నం మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు మార్గ దర్శకంగా ఉండాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు అకడమిక్ సూచనలు అందించి కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సహకరించాలని చెప్పారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ రమణ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్‌లు పెరిగాయని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో జూనియర్ విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం దర్శి స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాన్ని నిర్వహించి 150 మంది విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యార్థులు తమ అభిప్రాయాలు ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. సైన్స్, ఆర్ట్ ఇన్‌చార్జ్‌లు కె.ప్రభుదాస్, కె. రవీంద్ర, జూనియర్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కోటయ్య, ఉన్నత పాఠశాలప్రదానోపాధ్యాయుడు కాలేషావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ సేవకుడు జీవీ రత్నం

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణుల సీమంతానికి హాజరైన ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు (దర్శి): పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం మారెళ్లలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ సుంకర సునీతా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో అక్షతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలు పరిశీలించారు. సునీత మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీడీఓ జనార్దన్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం నిరంతరం సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. సీడీపీఓ భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు. బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సమాచార హక్కును సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మరియదాసు

పుల్లలచెరువు: సమాచార చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మరియదాసు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియదాసు, ఏవో నిర్మలాదేవిలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005లో అమలు చేశారని, చట్టం ఉద్దేశం అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం, అవినీతిని అరికట్టడం, సమాచారంలో పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించడంపై వివరించారు. ఇటీవల కొత్తగా ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా అధికారులు చూడాలన్నారు. ఈవోపీఆర్డీ శరత్‌బాబు పాల్గొన్నారు.

తటాకాలను తలపిస్తున్న వీధులు



గొల్లపాలెంలో వీధుల వద్ద నిలిచిన నీరు

● మురుగు నిల్వల్లో పల్లెలు

కురిచేడు: డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షానికి ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి తటాకాలను తలపిస్తున్నాయి. మండలంలోని గొల్లపాలెంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు వీధుల్లో నిల్వ చేరి తటాకాలను తలపిస్తున్నాయి. గ్రామం అనుకుని రెండు చెరువులు ఉన్నా ఆ చెరువుల్లోకి నీరు చేరేందుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయాయి. ఒకవైపు సీజనల్ వ్యాధులు ప్రబలి, ప్రభుత్వ వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్న వర్షం దసరా బోనస్‌గా పరిణమించిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటి నిల్వలతో మళ్లీ ఎలాంటి వ్యాధులు ప్రబలుతాయోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి నిల్వలు లేకుండా చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మన ఇల్లు.. మన గౌరవం విజయవంతం చేద్దాం

దర్శి: మన ఇల్లు.. మనగౌరవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెప్మా పీడీ టి.రవికుమార్ సూచించారు. స్థానిక మండల సమావేశం హాలులో గృహనిర్మాణ శాఖపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ దర్శి పట్టణం, మండల పరిధిలోని లేఔట్‌ల్లో సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహాలన్నీ 2025 మార్చి 31 నాటికి పూర్తి చేయాలన్నారు. రూఫ్‌లెవల్, రూఫ్ కాస్ట్ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలు అక్టోబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బంది, లేఔట్ అధికారులు మండల స్థాయి అధికారులు తగిన కార్యాచరణ ప్రణాళికలతో లక్ష్యాలు సాధించాలన్నారు. మండల అభివృద్ధి అధికారి కుసుమకుమారి మాట్లాడుతూ గృహ నిర్మాణం కోసం అవసరమైన మేస్త్రీలు, ఇటుక, మెటల్, సిమెంట్, సెంట్రింగ్ సరఫరా దారులను మండస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. షేక్ శాకీర్ బాషా, ఈఓఆర్డీ గుత్తా శోభన్‌బాబు, ఏపీఓ కళ్యాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవికుమార్

డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ టెట్

దర్శి: డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో టీచర్స్ అకాడమీలు సంయుక్తంగా మోడల్ టెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మీనిగ శ్రీను, షేక్ ఖాశీంలు ఒక ప్రకటనలో తెలిపారు. గీతాంజలి డిగ్రీ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు పర్యవేక్షణలో జరిగే మోడల్ టెట్ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. టెట్ రాసే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 97056 20277, 91855 5003661, 90108 18910 నంబర్లను సంప్రదించాలని కోరారు.